హైదరాబాద్ నుంచి మస్కట్‌కు విమానం

హైదరాబాద్ సిటీబ్యూరో/శంషాబాద్ రూరల్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): జీఎమ్మార్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మస్కట్‌కు సలాం ఎయిర్‌లైన్స్ నూతన సర్వీస్‌ను ప్రారంభించింది. ఈ నూతన సర్వీసును ఎయిర్‌పోర్టు సీఈవో ప్రదీప్ పణికర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మా ప్రయాణికులకు విస్తృతమైన ప్రయత్నంలో కొత్త విమానయాన సంస్థకు స్వాగతం పలకడం సంతోషంగా ఉందన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా నూతన సర్వీసులను ప్రారంభిస్తున్నట్ల తెలిపారు. హైదరాబాద్ నుంచి ఓవీ 732 నంబర్ కలిగిన విమాన సర్వీసు ఉదయం 3.55 గంటలకు బయలుదేరి 6 గంటలకు మస్కట్ చేరుకోనున్నది. తిరుగు ప్రయాణంలో ఓవీ 731 నంబర్ కలిగిన విమానం మస్కట్‌లో రాత్రి 22.15 గంటలకు బయలుదేరి అర్ధరాత్రి 2.55 గంటలకు హైదరాబాద్‌కు చేరుకోనున్నది. ఈ సర్వీసు ప్రతి మంగళ, బుధ,శుక్ర, ఆదివారాల్లో విమాన రాకపోకలు ఉంటాయని వివరించారు.

టీ హబ్‌లో ఐసీటీ ఫర్ అగ్రికల్చర్ ఇండియా చాప్టర్

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): అభివృద్ధి చెందుతున్న అత్యాధునిక టెక్నాలజీలను వ్యవసాయ రంగంలోనూ విరివిగా వినియోగించేలా ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ ఆధ్వర్యంలో కొత్తగా ఐసీటీ ఫర్ అగ్రి కల్చర్ ఇండియా చాప్టర్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ ఓఎస్‌డీ రమాదేవి తెలిపారు. మంగళవారం టీ హబ్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్ ఈ చాప్టర్‌ను ప్రారంభిస్తున్నారని తెలిపారు. భారత దేశంలో అగ్రి-ఫుడ్ సిస్టమ్స్ కోసం సమగ్రమైన, బాధ్యతాయుతమైన డిజిటల్ ఆవిష్కరణల దిశగా వర్క్‌షాపులను నిర్వహిస్తున్నామని, ప్రారంభ కార్యక్రమంలో పలువురు నిపుణులు ప్రసంగిస్తారని ఆమె తెలిపారు.

ఎపియోన్‌కు 'తెలంగాణ బిజినెస్ అవార్డు'

హైదరాబాద్, డిసెంబర్ 18: ప్రఖ్యాత నొప్పి నివారణ కేంద్రం ఎపియోన్ పెయిన్ సెంటర్ 'తెలంగాణ బిజినెస్ అవార్డు' గెలుచుకున్నది. ఈ విషయాన్ని ఎపియోన్ సెంటర్ వ్యవస్థాపకులు డాక్టర్ సుధీర్ దారా, సహ వ్యవస్థాపకులు డాక్టర్ మినాల్ చంద్ర తెలిపారు. హైదరాబాద్‌లో ఏషియన్ అరబ్ ట్రేడ్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును డాక్టర్ సుధీర్ అందుకున్నారు. మోకాళ్లు, కీళ్ల నొప్పుల నివారణకు అందిస్తున్న అధునాతన చికిత్సల వల్లనే ఈ ప్రతిష్ఠాత్మకమైన అవార్డును సొంతం చేసుకోగలిగామని సుధీర్ అన్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరుల్లో 30వేలకుపైగా రోగులకు చికిత్స చేశామని చెప్పారు.

ఐపీవోల సందడే సందడి

ఈ వారం అరడజనుకుపైగా పబ్లిక్ ఆఫర్లు ప్రారంభం

ముంబై, డిసెంబర్ 18: ఆల్ టైమ్ రికార్డుస్థాయిలో స్టాక్ మార్కెట్ ట్రేడవుతున్న తరుణంలో సొమ్ము చేసుకునేందుకు తొలి పబ్లిక్ ఆఫర్లు (ఐపీవోలు) క్యూ కట్టాయి. ఇటీవల లిస్టయిన టాటా టెక్నాలజీస్, ఐఆర్‌ఈడీఏలు వాటి ఐపీవో ధరకు మూడు, నాలుగు రెట్లు పెరిగిన నేపథ్యంలో ఆఫర్లకు సబ్‌స్క్రయిబ్ చేయాలన్న ఆసక్తి సైతం ఇన్వెస్టర్లలో నెలకొనడంతో హడావుడిగా కంపెనీలు ఐపీవోలును తెచ్చేస్తున్నాయి. ఈ వారంలోనే అరడజనుకుపైగా సిద్ధంకాగా, సోమవారమే మూడు ప్రారంభమయ్యాయి. మరికొన్ని మంగళ, బుధవారాల్లో మొదలవుతున్నాయి. వివరాలు:

మోతిసన్స్ జ్యువెల్లర్స్

జైపూర్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆభరణాల కంపెనీ మోతిసన్స్ జ్యువలర్స్ పబ్లిక్ ఆఫర్ డిసెంబర్ 18న ప్రారంభమయ్యింది. ఐపీవోలో రూ.151 కోట్ల సమీకరించి, ఆ మొత్తాన్ని రుణ చెల్లింపులకు, వర్కింగ్ క్యాపిటల్, ఇతర కార్పొరేట్ అవసరాలకు వినియోగించుకోవాలన్నది కంపెనీ ప్రతిపాదన. ఇప్పటికే యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.36 కోట్లు సమీకరించింది. ఒక్కో షేరును రూ.55 ధర వద్ద యాంకర్ ఇన్వెస్టర్లు కొనుగోలు చేశారు.

ముత్తూట్ మైక్రోఫిన్

ముత్తూట్ గ్రూప్ సూక్ష్మ రుణ వితరణ సంస్థ ముత్తూట్ మైక్రోఫిన్ రూ.960 కోట్ల సమీకరణకు ఐపీవో తీసుకొచ్చింది. ఇందులో రూ.760 కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్లను జారీచేస్తుండగా, రూ.200 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఒక విదేశీ ఫండ్, ప్రమోటర్లు విక్రయిస్తున్నారు. డిసెంబర్ 18న ప్రారంభమైన ఈ ఐపీవో ధర రూ.277-291 శ్రేణిగా నిర్ణయించారు. ఈ మొత్తాన్ని రుణ చెల్లింపులకు, సబ్సిడరీల కొనుగోలు, ఇతర కార్పొరేట్ అవసరాలకు వినియోగించాలని కంపెనీ ప్రతిపాదించింది.

సూరజ్ ఎస్టేట్ డెవలపర్స్

ముంబై కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న రియల్టీ కంపెనీ సూరజ్ ఎస్టేట్ డెవలపర్స్ ఐపీవో డిసెంబర్ 18న మొదలయ్యింది. ఒక్కో షేరకు రూ.340-360 ధరల శ్రేణితో రూ.రూ.400 కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్లను ఆఫర్ చేస్తున్నది. ఇందులో ఇప్పటికే యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 120 కోట్లు సమీకరించింది. ఈ మొత్తాన్ని రుణ చెల్లింపులకు, సబ్సిడరీల కొనుగోలు, ఇతర కార్పొరేట్ అవసరాలకు వినియోగించాలని కంపెనీ ప్రతిపాదించింది.

హ్యాపీ ఫోర్జింగ్స్

ఆటో విడిభాగాల తయారీ కంపెనీ హ్యాపీ ఫోర్జింగ్స్ రూ. 1,008 కోట్ల సమీకరణకు పబ్లిక్ ఆఫర్ జారీచేస్తున్నది. డిసెంబర్ 21 నుంచి ప్రారంభమయ్యే ఈ ఐపీవోకు షేరు ధరను రూ. 808-850 శ్రేణిగా నిర్ణయించారు. రూ.400 కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్లను ఇష్యూ చేస్తుండగా, 71.6 లక్షల షేర్లను ప్రమోటర్లు, ఇతర ఇన్వెస్టర్లు ఆఫర్ ఫర్ సేల్‌గా విక్రయిస్తున్నారు. తాజా ఈక్విటీ ద్వారా కంపెనీ సమీకరించిన నిధుల్ని పరికరాల కొనుగోలుకు, రుణ చెల్లింపులకు, ఇతర కార్పొరేట్ అవసరాలకు ఉపయోగించాలని కంపెనీ ప్రతిపాదించింది.

క్రెడో బ్రాండ్స్

డెనిమ్ బ్రాండ్ ముష్టిని మార్కెట్ చేస్తున్న క్రెడో బ్రాండ్స్ మార్కెటింగ్ ప్రమోటర్లు, ప్రస్తుత షేర్‌హోల్డర్లు ఆఫర్ ఫర్ సేల్ రూపంలో రూ. 550 కోట్ల షేర్లను విక్రయించేందుకు ప్రతిపాదించిన ఐపీవో డిసెంబర్ 19న ప్రారంభమవుతుంది. దేశంలో మిడ్-ప్రీమియం, ప్రీమియం క్యాజువల్ మెన్స్ వేర్ మార్కెట్లో క్రెడో బ్రాండ్స్ ప్రాచుర్యం సంపాదించింది. షేరుకు రూ.266-280 ధరల శ్రేణితో ఈ కంపెనీ ఐపీవో జారీ అవుతున్నది.

ఆర్‌బీజడ్ జ్యువెల్లర్స్

బీ2బీ, రిటైల్ జ్యువెల్లరీ వ్యాపారం చేస్తున్న ఆర్‌బీజడ్ జ్యువెల్లర్స్ జారీచేస్తున్న ఐపీవోలో ఒక కోటి షేర్లను ఆఫర్ చేస్తున్నది. షేరుకు రూ.95-100 శ్రేణిలో ఆఫర్‌కు ధర నిర్ణయించారు. డిసెంబర్ 21న ఐపీవో ప్రారంభమై 21న ముగుస్తుంది. ఆఫర్ ద్వారా సమీకరించే నిధుల్ని వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించాలని కంపెనీ ప్రతిపాదించింది.

అజాద్ ఇంజనీరింగ్



హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న అజాద్ ఇంజనీరింగ్ ఐపీవో డిసెంబర్ 20న జారీకానుంది. రూ.740 కోట్ల సమీకరణకు ప్రతిపాదించిన ఈ ఐపీవోకు ధరను రూ.499-524 శ్రేణిగా నిర్ణయించారు. రూ.500 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ప్రమోటర్లు, ఇతర ఇన్వెస్టర్లు ఆఫర్లో విక్రయిస్తుండగా, రూ. 240 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కంపెనీ తాజాగా జారీ చేస్తున్నది. తాజా ఈక్విటీ ద్వారా సమీకరించే నిధుల్ని విస్తరణకు, రుణ చెల్లింపులకు ఉద్దేశించారు.

హైదరాబాద్‌లో యారీ

నగర ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల సంఘం భాగస్వామ్యంతో పరిచయమైన మరో రైడ్-బుకింగ్ యాప్

హైదరాబాద్, డిసెంబర్ 18: హైదరాబాద్‌కు సోమవారం మరో రైడ్-బుకింగ్ యాప్ 'యారీ' పరిచయమైంది. అయితే ఇప్పటికే ఉన్న ఓలా, ఉబర్, రాపిడో వంటి రైడ్-బుకింగ్ యాప్‌కు పోటీగా నగరంలోని ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల సంఘం ద్వారా దీన్ని తీసుకురావడం విశేషం. కాగా, కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) ప్రోటోకాల్స్‌పై ఈ యాప్‌ను నిర్మించారు. హైదరాబాద్‌లోని 20వేలకుపైగా ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు యారీలో భాగస్వాములు కావడం గమనార్హం. ఈ క్రమంలోనే ఇతర నగరాల్లో కూడా ఈ సేవల్ని ప్రారంభించే దిశగా వెళ్తున్నట్టు యారీ వ్యవస్థాపకుల్లో ఒకరు, సీఈవో హరిప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయా నగరాల్లోని ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల సంఘాలతో చర్చిస్తున్నట్టు ఓ ప్రకటనలో ఆయన చెప్పారు. 'డ్రైవర్ల కోసం డ్రైవర్లతో ఏర్పాటైనదే ఈ యారీ. ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల సంక్షేమం కోసం, వారికి శ్రమకు తగిన ప్రతిఫలం అందేలా, వారి వ్యాపార, ఆదాయ మార్గాల రక్షణార్థం యారీ యాప్‌ను అభివృద్ధి చేశాం. డ్రైవర్లు ఎవరికీ కమీషన్లు ఇవ్వనక్కర్లేదు. ప్రయాణీకులకూ విశ్వసనీయమైన, ప్రయోజనకరమైన సేవలు అందుతాయి' అని హరిప్రసాద్ అన్నారు.

అన్నివిధాలా అండగా..

డ్రైవర్లకు, వారి కుటుంబాలకు బీమా, న్యాయపరమైన సహాయం కూడా అందిస్తామని హరిప్రసాద్ ఈ సందర్భంగా వివరించారు. తమ యాప్ సేవలకుగాను నామమాత్రపు ఫీ తీసుకుంటామన్నారు. రాబోయే 6 నెలల్లో దేశవ్యాప్తంగా 20 లక్షలకుపైగా కస్టమర్లు, లక్షకుపైగా డ్రైవర్లే లక్ష్యంగా ముందుకెళ్లనున్నట్టు చెప్పారు. యారీ డ్రైవర్లకు వారికి అనువైన సమయంలోనే పనిచేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, మొబైల్ నెంబర్ సాయంతో యారీ పార్ట్‌నర్ యాప్‌ను ఆటో, ట్యాక్సీ డ్రైవర్లెవరైనా ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని హరిప్రసాద్ వివరించారు. ప్రయాణికులు ఉచితంగానే ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి యారీ రైడ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

విక్రమ్-1 లాంచ్ వెహికిల్ తొలి దశపై పీపీటీని నిర్వహించిన స్కైరూట్ ఏరోస్పేస్

స్కైరూట్ పీపీటీ విజయవంతం

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్.. మరో ఘనత సాధించింది. విక్రమ్-1 ఆర్బిటల్ లాంచ్ వెహికిల్‌కు సంబంధించి తొలి దశ కింద చేపట్టిన కీలకమైన ప్రూఫ్ ప్రెషర్ టెస్ట్ (పీపీటీ) విజయవంతమైందని సోమవారం స్కైరూట్ తెలిపింది. కాగా, టీ-హబ్ కేంద్రంగా ప్రారంభమై అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థగా స్కైరూట్ పలు ప్రయోగాలను ఇప్పటికే విజయవంతంగా చేపట్టిన విషయం తెలిసిందే. ఇక మొదటి దశకు 'కలాం-1200' పేరు పెట్టామని, తాజాగా జరిపిన పరీక్షలో గరిష్ఠంగా ఊహించిన ఒత్తిడిని విక్రమ్-1 అధిగమించిందని స్కైరూట్ బృందం తెలిపింది. పీపీటీ విజయవంతం కావడం.. కేవలం మా సంస్థకేగాక, యావత్తు భారతీయ అంతరిక్ష నౌక సామర్థ్యాలకే గర్వకారణమని ఈ సందర్భంగా స్కైరూట్ అభివర్ణించింది. లో ఎర్త్ ఆర్బిట్‌లోకి దాదాపు 300 కిలోల పేలోడ్స్‌ను తీసుకెళ్లడానికి వీలుగా ఈ విక్రమ్-1ను రూపొందించారు.

ప్లే స్టోర్‌లో 2,500 మోసపూరిత యాప్స్ ఔట్

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబర్ 18: గూగుల్ ప్లే స్టోర్ నుంచి 2,500 మోసపూరిత యాప్స్‌ను తొలగించినట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. మోసపూరిత రుణ యాప్స్‌ను కట్టడి చేయడానికి ఆర్బీఐ, ఇతర రెగ్యులేటర్లు, వాటాదారులూ పలు కఠిన చర్యలు తీసుకుంటున్నారని లోక్‌సభలో మంత్రి లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. ప్రభుత్వం కూడా కీలక చర్యలు తీసుకుందని, చట్టబద్ధత ఉన్న యాప్స్‌ను గుర్తించడం జరిగిందని, ఈ జాబితాను గూగుల్‌కు కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం పంపించినట్టు చెప్పారు. ఈ క్రమంలోనే ఏప్రిల్ 2021 నుంచి జూలై 2022 వరకు గూగుల్ 3,500 నుంచి 4 వేల వరకు లెండింగ్ యాప్స్‌ను నిశితంగా పరిశీలించిన తర్వాత వీటిలో 2,500 యాప్స్‌ను గుర్తించి ప్లే స్టోర్ నుంచి తొలగించినట్టు మంత్రి చెప్పారు. ది ఇండియన్ సైబర్ క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ), హోం మంత్రిత్వ శాఖ సంయుక్తంగా డిజిటల్ లెండింగ్ యాప్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్నాయి. ఈ మోసపూరిత యాప్స్‌కు వ్యతిరేకంగా ప్రజలకు అవగాహన ఉండాలని, ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రజలు సురక్షితమైన లావాదేవీలకు మొగ్గుచూపాలన్నారు. మరో ప్రశ్నపై మంత్రి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి ముద్ర యోజన(పీఎంఎంవై) పథకం అందుబాటులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు 44.46 కోట్ల ఖాతాలకు రూ.26.12 లక్షల కోట్ల రుణాలు మంజూరు చేసినట్టు చెప్పారు.

ప్రత్యక్ష పన్ను వసూళ్ల జోరు

న్యూఢిల్లీ, డిసెంబర్ 18: ప్రత్యక్ష పన్ను వసూళ్లు జోరందుకున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 13.70 లక్షల కోట్ల మేర ప్రత్యక్ష పన్ను వసూళ్లయ్యాయని ఆదాయ పన్ను శాఖ తాజాగా వెల్లడించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో వసూలైన రూ.11,35,754 కోట్లతో పోలిస్తే 20.66 శాతం అధికం. ఈ నెల 17 నాటికి రూ.13,70,388 కోట్ల ప్రత్యక్ష పన్నులు వసూలయ్యాయి. వీటిలో కార్పొరేషన్ ట్యాక్స్ కింద రూ.6.95 లక్షల కోట్లు, సెక్యూరిటీ ట్రాన్జాక్షన్ ట్యాక్స్ కలుపుకొని వ్యక్తిగత ఆదాయ పన్ను రూ.6.73 లక్షల కోట్లుగా ఉన్నాయి.

బీవోబీ బ్రో సేవింగ్స్ అకౌంట్

విద్యార్థుల కోసం భారీ ఆఫర్లతో పొదుపు ఖాతా

హైదరాబాద్/ముంబై, డిసెంబర్ 18: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ).. విద్యార్థుల సాధికారత కోసం ఆకర్షణీయమైన ఆఫర్లతో 'బ్రో' పేరిట ఓ సేవింగ్స్ ఖాతాను పరిచయం చేసింది. 16-25 ఏండ్లవారు అర్హులు. విద్యార్థుల ఆర్థిక అవసరాలకు అనుగుణంగా దీన్ని రూపొందించారు. ఇక ఈ ఖాతాలకు మినిమం బ్యాలెన్స్ నిబంధన వర్తించదు. అలాగే ఖాతాదారులు ఎలక్ట్రానిక్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ట్రావెల్, ఫుడ్, ఫ్యాషన్, ఎంటర్‌టైన్‌మెంట్, లైఫ్‌స్టైల్, గ్రాసరీ, హెల్త్‌కు సంబంధించిన లావాదేవీల్లో గొప్ప ఆఫర్లు అందుకునేలా ఓ లైఫ్‌టైమ్ ఫ్రీ రూపే ప్లాటినమ్ డెబిట్ కార్డును బ్యాంక్ ఇస్తున్నది. అంతేగాక దేశంలోని విమానాశ్రయాల్లో ప్రోత్సాహక లాంజ్ యాక్సెస్ సౌకర్యాన్ని కల్పిస్తున్నది. 3 నెలలకు 2 అనుమతులుంటాయి. సమీపంలోని బీవోబీ శాఖను సంప్రదించి ఈ బ్రో ఖాతాను అర్హులైన విద్యార్థులు తీసుకోవచ్చని బ్యాంక్ ఓ ప్రకటనలో తెలియజేసింది.

బ్రో ఖాతా ప్రత్యేకతలు

- జీరో బ్యాలెన్స్ సౌకర్యం
- జీవితకాల ఉచిత రూపే ప్లాటినమ్ డెబిట్ కార్డు
- రూ.2 లక్షలదాకా ఉచిత వ్యక్తిగత ప్రమాద బీమా కవరేజీ
- ఆటో స్వీప్ సదుపాయం
- ఉచిత నెఫ్ట్/ఆర్టీజీఎస్/ఐఎంపీఎస్/యూపీఐ సేవలు
- అపరిమితంగా చెక్ బుక్కులు
- ఉచిత ఎస్ఎంఎస్/ఈ-మెయిల్ అలర్ట్స్
- డీమ్యాట్ ఖాతాలపై వార్షిక నిర్వహణ చార్జీల్లో 100 శాతం వరకు రాయితీ
- విద్యా రుణాల వడ్డీరేట్లపై 15 బేసిస్ పాయింట్ల వరకు తగ్గింపు, ప్రాసెసింగ్ ఫీ ఉండదు
- అర్హతలకు లోబడి అందుబాటులో ప్రత్యేక క్రెడిట్ కార్డు ఆఫర్లు

'మేకర్ ఫెయిర్ విజయవంతం'

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): తెలంగాణ యువతలో సృజనాత్మక సామర్థ్యాన్ని పెంపొందించడంలో మేకర్ ఫెయిర్ హైదరాబాద్ కీలక పాత్ర పోషించిందని ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్ రంజన్ అన్నారు. టీ వర్క్స్‌లో రెండు రోజులపాటు జరిగిన మేకర్ ఫెయిర్ హైదరాబాద్ విజయవంతమైందని, యువత నుంచి విశేష స్పందన వచ్చిందని తెలిపారు. గ్లోబల్ మేకర్ ఉద్యమానికి అనుగుణంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి 30వేల మందికిపైగా తయారీ రంగంలో ఆసక్తి ఉన్నవారు హాజరయ్యారని చెప్పారు. మేకర్లతో రౌండ్ టేబుల్ చర్చలు జరిగాయని పేర్కొన్నారు. కాగా, సరికొత్త ఆవిష్కరణలకు తెలంగాణ ఎంతో అనుకూలంగా ఉందని.. ఇంజినీరింగ్, డిజైనింగ్, టెక్నాలజీ వర్క్‌షాప్‌లలో ప్రయోగాలు చేస్తూ ఔత్సాహికులు ఎంతో అనుభవాన్ని గడించారన్నారు. ఇదిలావుంటే టీ వర్క్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన 18 మీటర్ల పొడవైన మస్కట్ అందరినీ ఆకట్టుకుందన్నారు. టీ వర్క్స్ సీఈవో ఆనంద్ రాజగోపాలన్ మాట్లాడుతూ.. 'మేకర్ ఫెయిర్ హైదరాబాద్ ఈవెంట్‌లో సరికొత్త ఆవిష్కరణలు చేయాలన్న పట్టుదలతో ఉన్నవారు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. టీ వర్క్స్ అంటేనే కొత్త వస్తువుల నమూనాల తయారీకి కేంద్రం. అలాంటిచోట ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంతో వేలాదిమంది ఎంతో ఆసక్తిగా వచ్చి తమ ఆలోచనలకు అనుగుణంగా కొత్త వస్తువుల తయారీలో భాగస్వాములుగా నిలిచారు' అన్నారు.

రికార్డుల నుంచి వెనక్కి

168 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబై, డిసెంబర్ 18: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస లాభాలకు బ్రేక్‌పడింది. పెట్టుబడిదారులు ప్రాఫిట్ బుకింగ్‌కు మొగ్గుచూపడంతో రికార్డు స్థాయి నుంచి వెనక్కితగ్గాయి. ఆసియా మార్కెట్లు బలహీనంగా ట్రేడవడం కూడా మార్కెట్ల పతనానికి ఆజ్యంపోశాయి. ఒక దశలో 300 పాయింట్లకు పైగా నష్టపోయి 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 168.66 పాయింట్లు కోల్పోయి 71,315.09 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌తో పాటు నిఫ్టీ కూడా 38 పాయింట్లు కోల్పోయి 21,418.65 వద్ద నిలిచింది.

- పవర్‌గ్రిడ్ 2.34 శాతం తగ్గి టాప్ లూజర్‌గా నిలిచింది.
- ఐసీఐసీఐ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఐటీసీ, టెక్ మహీంద్రాలు ఒక్క శాతానికి పైగా మార్కెట్‌ను కోల్పోయాయి.
- అలాగే ఇన్ఫోసిస్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండస్‌ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, విప్రో, భారతీ ఎయిర్‌టెల్, టాటా మోటర్స్, కొటక్ బ్యాంక్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు నష్టపోయాయి.
- కానీ, సన్‌ఫార్మా, రిలయన్స్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌సీఎల్ టెక్, ఏషియన్ పెయింట్స్, టైటాన్, హెచ్‌యూఎల్, మారుతి, టాటా స్టీల్, ఎల్‌అండ్‌టీ, ఎస్బీఐలు లాభపడ్డాయి.
- బీఎస్ఈ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఇండెక్స్‌లు స్వల్పంగా లాభపడ్డాయి.
- రంగాలవారీగా చూస్తే రియల్టీ, ఆర్థిక సేవలు, ఎఫ్ఎంసీజీ, ఐటీ, టెక్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగ సూచీలు నష్టపోయాయి.
- కానీ, సర్వీసు ఇండెక్స్, టెలికమ్యూనికేషన్స్, క్యాపిటల్ గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్ రంగ షేర్లు లాభపడ్డాయి.
- అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర స్వల్పంగా తగ్గి 76.33 డాలర్ల వద్ద నిలిచింది.

2024లో 22 వేలకు నిఫ్టీ

వచ్చే ఏడాది కూడా నిఫ్టీ 21 వేల పాయింట్ల పైన్నే కదలాడనున్నదని కొటక్ సెక్యూరిటీస్ అభిప్రాయపడింది. 2024 చివరినాటికి నిఫ్టీ 21,834 పాయింట్ల స్థాయిలో కదలానున్నదని తన అవుట్‌లుక్‌లో పేర్కొంది. 2023లో 13 శాతం పెరిగిన సూచీ వచ్చే ఏడాది మాత్రం రెండు శాతం వృద్ధిని సాధించనున్నదని అంచనావేస్తున్నది. అలాగే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు 39 శాతం, 48 శాతం చొప్పున బలపడనున్నాయని సోమవారం విడుదల చేసిన అవుట్‌లుక్ 2024లో పేర్కొంది.

చమురు సరఫరాలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలున్నాయన్న అంచనాలు మదుపరులపై ప్రతికూల ప్రభావం చూపాయి. ప్రారంభంలో భారీగా నష్టపోయిన సూచీలు.. మధ్యాహ్నం తర్వాత విదేశీ మార్కెట్ల నుంచి వచ్చిన దన్నుతో కోలుకోగలిగాయి.

- వినోద్ నాయర్, జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్

15 రోజుల్లో రూ.42 వేల కోట్లు

ఎఫ్‌పీఐల నిధుల వెల్లువ

ముంబై, డిసెంబర్ 18: భారత ఈక్విటీ మార్కెట్లోకి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) క్యూ కట్టారు. డిసెంబర్ నెల తొలి 15 రోజుల్లో ఈక్విటీల్లో రూ.42,733 కోట్లు (5.15 బిలియన్ డాలర్లు) పెట్టుబడి చేశారు. ఒక పక్షం రోజుల్లో ఎఫ్‌పీఐలు ఇంత పెద్దమొత్తంలో ఇన్వెస్ట్ చేయడం ఇదే ప్రథమం. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో భారీ మొత్తంలో నిధుల్ని వెనక్కు తీసుకున్న ఎఫ్‌పీఐలు నవంబర్ ద్వితీయార్థం నుంచి తిరిగి కొనుగోళ్లు ప్రారంభించి, డిసెంబర్ తొలి రెండు వారాల్లో పెట్టుబడుల్ని వేగంగా పెంచుకుంటూపోయారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో సంస్కరణలు కొనసాగుతాయన్న అంచనాలు, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వచ్చే ఏడాది వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న సంకేతాలు, భారత జీడీపీ వృద్ధి అంచనాల్ని రిజర్వ్‌బ్యాంక్ పెంచడం తదితర అంశాల కారణంగా విదేశీ ఇన్వెస్టర్లు జోరుగా కొనుగోళ్లు జరిపినట్టు విశ్లేషకులు చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిఫ్టీ-50 లిస్టెడ్ కంపెనీల లాభాలు 15 శాతం మేర వృద్ధి చెందవచ్చని బ్రోకరేజ్ సంస్థ జెఫరీస్ అనలిస్టులు ఒక తాజా నోట్‌లో పేర్కొన్నారు. అయితే విదేశీ ఇన్వెస్టర్ల పొజిషన్లు ఇప్పటివరకూ భారత్ మార్కెట్లో తక్కువగా ఉన్నందున, కరెక్షన్లను కొనుగోళ్లకు ఉపయోగించుకుంటారని జెఫరీస్ వివరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి డిసెంబర్ 15 వరకూ దేశంలోకి రూ.1.74 లక్షల కోట్ల ఎఫ్‌పీఐ నిధులు వచ్చినట్టు నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.